ప్రజాశక్తి

ఆదివారం 10 నవంబరు 2024 | 5 | శ్రీకాకుళం



ఉత్తమ గురువులు నలుగురు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు జిల్లాకు చెందిన నలుగురిని వరించాయి. అవార్డులకు ఎంపికైన వారిలో లావేరు మండలం గోవిందపురం ప్రభుత్వ పాఠశాలలో ఎస్‌జిటిగా పనిచేస్తున్న జి.శ్రీనివాసరావు, బూర్జ మండలం ఒవిపేటలో ఏపి మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు, నరసన్నపేట జూనియర్ కళాశాల బోటనీ లెక్చరర్ ఎ.అప్పన్న, శ్రీకాకుళం బాలుర పాలిటెక్నిక్ కళాశాలలో సీనియర్ కంప్యూటర్ అధ్యాపకుడు డి.మురళీకృష్ణ ఉన్నారు. వీరికి జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 11న నిర్వహించే కార్యక్రమంలో అవార్డులు ప్రదానం చేయనున్నారు.

మహా ప్రదర్శనలో పెద్దసంఖ్యలో పాల్గొన్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు



మహాసభల సంరంభం

- ఘనంగా ప్రారంభమైన సిపిఎం 18వ జిల్లా మహాసభలు
- జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన పార్టీ శ్రేణులు
- నృత్యాలు, వాయిద్యాలతో సాగిన ప్రదర్శన
- పోరాటాల సమీక్ష... కర్తవ్య దీక్ష
- ధరల తగ్గింపుపై బిజెపివి మాయమాటలు
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
- ఐటిడిఎ ఏర్పాటుకు ప్రభుత్వంపై ఒత్తిడి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్

ఉద్యమాల గడ్డ ఉద్దానంలో సిపిఎం 18వ జిల్లా మహాసభలు ఉత్సాహంగా, చైతన్య స్ఫూర్తితో ప్రారంభమయ్యాయి. మహాసభల సందర్భంగా పలాస ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి కాశీబుగ్గ సంతమైదానం వరకు నిర్వహించిన మహా ప్రదర్శన, బహిరంగ సభకు జిల్లా నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో పార్టీ శ్రేణులు తరలివచ్చాయి. ఎర్రజెండాలు చేతపట్టుకుని ప్రదర్శనగా బయలుదేరారు. కదం తొక్కుతూ, పదం పాడుతూ ముందుకు సాగారు. డప్పు వాయిద్యాలు, తప్పెటగుళ్లు, కోలాటాలు, నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా కదిలారు. పార్టీ ప్రతినిధులతో మహాసభ ప్రాంతమైన కీ.శే సీతారాం ఏచూరి నగర్ (కాశీబుగ్గ రైల్వేకాలనీ) కళకళలాడింది. అరుణ పతాకాల రెపరెపలతో ఆ ప్రాంతంతో పాటు పలాస ఎరుపెక్కింది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, పలాస, వజ్రపుకొత్తూరు

ప్రజల ఆదాయాలు పెంచుతాం, రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామని ఎన్నికల ముందు ప్రధాని మోడీ మాయ మాటలు చెప్పారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. కాశీబుగ్గ సంతమైదానంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం సొంత విధానాలు అమలు చేయకుండా అంతా మోడీ చెప్పినట్లు చేస్తోందని చెప్పారు. జగన్ మాదిరిగానే చంద్రబాబు దెబ్బతింటారని హెచ్చరించారు. విశాఖ ఉక్కుపై ఒక్కో పార్టీ ఒక్కో తీరున మాట్లాడుతోందన్నారు. విశాఖ స్టీల్‌ను రక్షించుకోవడంతో పాటు 30 వేల మంది ఉద్యోగాలను కాపాడుతోంది సిపిఎం అని అన్నారు. వికసిత్ భారత్ అని మోడీ చెప్తుంటే, వికసిత్ 2047 అని చంద్రబాబు అంటున్నారని... కనీసం ఉత్తరాంధ్ర విజన్ అయినా ఉందా అని ప్రశ్నించారు. కేంద్ర బడ్జెట్‌లో శ్రీకాకుళం జిల్లాకు వెనుకబడిన ప్యాకేజీ కింద ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారని, ఒక్క పైసా అయినా విడుదల చేశారా అని ప్రశ్నించారు. ప్రజల ఆదాయం, ఆస్తులు పెంచే విజన్ కావాలన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఉండాలన్నారు. ప్రజల ఆదాయాలు పెరిగితే కొనుగోలు శక్తి పెరుగుతుందని చెప్పారు. తద్వారా మరిన్ని పరిశ్రమలు ఏర్పాటై యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగుతాయని.. ఈ రకమైన విజన్ ఉండాలన్నారు. పోలవరం జాతీయ ప్రాజెక్టు అయినందున కేంద్రం నుంచి చంద్రబాబే డబ్బులు తీసుకురావాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలు, సమస్యలపై ప్రజలు చర్చించకండా మతాలు, కులాలు, ఉప కులాల పేరుతో ప్రజల మధ్య చీలిక తెచ్చే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకు తిరుపతి లడ్డూ నుంచి మొదలుపెట్టి సనాతన ధర్మం వరకు మాట్లాడుతున్నారని చెప్పారు. మహిళల అణచివేత, సతీసహగమనం వంటివీ కోరుకుంటున్నారా అని ప్రశ్నించారు. తమ దృష్టిలో సనాతన ధర్మమంటే సమతా ధర్మం, సమాన ధర్మమని చెప్పారు. రాజకీయాలు భ్రష్టు పట్టిపోయాయని... మాఫియా, గుండాలు, అనినీతిపరులు రాజకీయాల్లో చేరి ప్రజల ఆస్తులను కొల్లగొడుతున్నారని తెలిపారు. రాజకీయాల్లో మహిళల పాత్ర పెరగాల్సిన అవసరముందన్నారు. మహిళలు ముందుండి పోరాడితే గానీ సమాజంలో మార్పు సాధ్యం కాదన్నారు.



బహిరంగ సభలో అభివాదం చేస్తున్న సిపిఎం నాయకులు

కార్పొరేట్లకు ఉప్పు భూములు కట్టబెట్టే కుట్ర

జిల్లాల పునర్విభజన తర్వాత జిల్లాలో ఐటిడిఎ లేకపోవడంతో గిరిజనుల సంక్షేమం, ఏజెన్సీ అభివృద్ధి లేకుండా పోయిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ అన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం వెంటనే ఐటిడిఎ ఏర్పాటు చేసేలా మహాసభలో కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. జిల్లాలోని ఉప్పు భూములను కూటమి ప్రభుత్వం కార్పొరేట్లకు అప్పగించాలని చూస్తోందని విమర్శించారు. ఎన్టీఆర్ వారసులమని చెప్తున్న టిడిపి నాయకులు, ఆయన పునాది వేసిన భావనపాడు ఫిషింగ్ హార్బర్‌ను ఎందుకు పూర్తి చేయడం లేదని ప్రశ్నించారు. పోర్టు పేరుతో వేలాది ఎకరాల ఉప్పు భూములను కట్టబెట్టేందుకు ప్రభుత్వం డ్రోన్ సర్వే కూడా చేసిందని చెప్పారు. సముద్రతీరంలో ఒక్క ఎకరా భూమిని ఇచ్చినా ఊరుకునేది లేదని హెచ్చరించారు. వీరగున్నమ్మ వారసత్వం, శ్రామిక, ఇతర అన్ని తరగతుల మహిళలు పోరాటాల్లో భాగస్వామ్యం కావాలన్నారు. ప్రజల హక్కుల కోసం పోరాడుతున్న సిపిఎంకు అండగా నిలవాలని కోరారు.



ఆకట్టుకున్న కళారూపాలు

మహాసభల సందర్భంగా పలువురు కళాకారులు పలుకళారూపాలను ప్రదర్శించారు. మెళియాపుట్టి మండలం చీపురుపల్లికి చెందిన శంకరరావు బృందం తప్పెట గుళ్ల ప్రదర్శించగా, మహిళలు ఎర్ర చీరలు ధరించి కోలాటం ఆడారు. ఆర్‌టిసి కాంప్లెక్స్, సభా వేదిక వద్ద ఎర్రజెండా, ఎర్ర జెండా ఎన్నియల్లో పాటకు వజ్రపుకొత్తూరు మండలం నగరంపల్లి చెందిన చిన్నారులు నృత్యం చేశారు. ప్రజా నాట్యమండలి కళాకారులు కె.హేమసూదన్ బృందం పలు విప్లవ గీతాలను ఆలపించారు.

భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తాం

వెనుకబడిన శ్రీకాకుళం జిల్లాలో పరిశ్రమలను ఏర్పాటు చేసి ఉద్యోగాలు కల్పిస్తామని, వలసలు నివారిస్తామంటూ పాలకులు మాటలే చెప్తున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు విమర్శించారు. నేరడి బ్యారేజీని పూర్తి చేస్తే రెండో పంటకూ వంశధార నీరు ఇవ్వవచ్చని చెప్పారు. జిల్లాలో ఒక్క సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి లేదన్నారు. మహాసభలో జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామని చెప్పారు. సభాధ్యక్షులు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు మాట్లాడుతూ ఉద్దాన ప్రాంతం ఉద్యమాలకు కేంద్రంగా ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమాలకు వేదిక కానుందన్నారు. వంశధార, బాహుదా నదులు అనుసంధానం చేస్తామని ఆరేళ్లుగా చెప్తున్నారు తప్ప నేటికీ నిధులు కేటాయించలేదని విమర్శించారు. పలాసకు సాగు, తాగునీరు అందించే ఆఫ్‌షోర్ ప్రాజెక్టును 15 ఏళ్లు కావస్తున్నా పూర్తి చేయలేదన్నారు.

ప్రజాశక్తి బుక్స్ స్టాల్ ఏర్పాటు

పార్టీ సాహిత్యం, ఉద్యమాల చరిత్రకు సంబంధించిన పుస్తకాలను ప్రజాశక్తి బుక్‌హౌస్ ఏర్పాటు చేసింది. పలువురు సందర్శకులు స్టాల్‌ను సందర్శించి పుస్తకాలు కొనుగోలు చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి, జి.సింహాచలం, జిల్లా కమిటీ సభ్యులు కె.నాగమణి, పి.తేజేశ్వరరావు, పోలాకి ప్రసాదరావు, ఎన్.షణ్ముఖరావు, ఎస్.ప్రసాదరావు, ఎన్.గణపతి తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం మహాసభల ఫొటో ఫీచర్ (epaper.prajasakti.com)

కార్పొరేషన్ పదవుల్లో ఇద్దరికి చోటు

- కళింగ సంక్షేమాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా 'రోణంకి'
- సుడా చైర్మన్‌గా కొరికాన రవికుమార్



కృష్ణంనాయుడు



రవికుమార్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

టిడిపి కూటమి ప్రభుత్వం రెండో విడత నామినేటెడ్ పదవులను భర్తీ చేసింది. ఇందుకు సంబంధించిన జాబితాను శనివారం విడుదల చేయగా, అందులో జిల్లాకు చెందిన ఇద్దరికి చోటు దక్కింది. కళింగ సంక్షేమాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా నరసన్నపేట నియోజకవర్గ టిడిపి నాయకుడు రోణంకి కృష్ణంనాయుడును నియమించారు. శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) చైర్మన్‌గా పాతపట్నం నియోజకవర్గ జనసేన నాయకులు కొరికాన రవికుమార్ నియమితులయ్యారు. పోలాకి మండలానికి చెందిన న్యాయవాది అయిన కృష్ణంనాయుడు 1995లో పోలాకి జెడ్‌పిటిసి సభ్యునిగా పనిచేశారు. కాంగ్రెస్ పార్టీని వీడి టిడిపిలో చేరిన ఆయన టిడిపి లీగల్ సెల్ నాయకునిగా క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. టిడిపి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాలను ముందుండి నడిపించారు. ఆయన సేవలను గుర్తించిన అధిష్టానం కార్పొరేషన్ చైర్మన్ పదవిని కట్టబెట్టింది. పారిశ్రామికవేత్త అయిన కొరికాన రవికుమార్ రాజకీయాలపై ఆసక్తితో జనసేనలో చేరారు. కొన్నాళ్లుగా పాతపట్నం నియోజకవర్గ బాధ్యతలు చూస్తున్నారు. ఆయన భార్య భవాని గత ఎన్నికల్లో పాతపట్నం టిక్కెట్‌ను ఆశించినా, పొత్తులో భాగంగా టిడిపికి ఆ సీటు కేటాయించారు. కూటమి అభ్యర్థి మామిడి గోవిందరావు విజయంలో ఆమె కీలకంగా వ్యవహరించారు. పాలకొండ జనసేన అభ్యర్థి జయకృష్ణ విజయంలో కీలకపాత్ర పోషించారు.



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు తదితరులు

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం రూరల్

వ్యవసాయం లాభసాటిగా మారాలంటే రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు. ఉత్తర కోస్తాకు అనువైన లాభసాటి వ్యవసాయ విధానాలు అనే అంశంపై ఆచార్య ఎన్.జి రంగా పరిశోధనా స్థానం, వ్యవసాయ శాఖ సంయుక్తంగా రాగోలు వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో శనివారం నిర్వహించిన కిసాన్‌మేళాను ప్రారంభించారు. ఎమ్మెల్యే గొండు శంకర్ అధ్యక్షతన నిర్వహించిన సభలో రైతులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ రైతులు తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందేలా ప్రణాళిక రూపొందిస్తున్నామని చెప్పారు. మార్టేరును తలదన్నేలా రాగోలు వ్యవసాయ పరిశోధనా స్థానాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. శ్రీకాకుళం సన్నాలు బియ్యంకు ప్రపంచ ఖ్యాతి వచ్చేలా కృషి చేస్తామని చెప్పారు. పొలం పిలుస్తుంది కార్యక్రమం ద్వారా వారంలో రెండు రోజులు వ్యవసాయ, దాని అనుబంధ శాఖల అధికారులు రైతుల దగ్గరకు వెళ్లాలన్నారు. జిల్లాలో సకాలంలో నీరందక కరువు, కాటకాలతో వ్యవసాయాన్ని వదిలి వలసలు వెళ్లే వారి సంఖ్య పెరుగుతుందని, దాన్ని నిరోధించాలన్నారు. సబ్సిడీపై యంత్రాలు, డ్రోన్లను అందిస్తామన్నారు. సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని, ఏటా భూసార పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామాలకు డ్రోన్ల సాంకేతికతను అందుబాటులో ఉంచామని, రైతులు గ్రూపులుగా ఏర్పడి వాటి సేవలు తక్కువ ధరకు పొందవచ్చని చెప్పారు. పాఠశాల స్థాయి విద్యార్థులు కూడా తరచూ ఇలాంటి మేళా లకు హాజరై కొత్త విషయాలు నేర్చుకునేలా ప్రోత్సహించాలన్నారు. తొలుత వ్యవసాయ ఉత్పత్తి ప్రదర్శనలను ఆసక్తిగా తిలకించారు. వ్యవసాయ యాజమాన్య పద్ధతులపై ప్రచురించిన పలు పుస్తకాలను మంత్రి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, ఆచార్య ఎన్.జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆర్.శారద, జయలక్ష్మి దేవి, రాగోలు వ్యవసాయ పరిశోధనా స్థానం సంచాలకులు పి.వి సత్యనారాయణ, విస్తరణ సంచాలకులు జి.శివనారాయణ, వ్యవసాయ విశ్వ విద్యాలయం డీన్ సిహెచ్.శ్రీనివాసరావు, వ్యవసాయశాఖ జెడి కె.త్రినాథస్వామి తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యంతోనే సైబర్ నేరాల శోధన

ప్రజాశక్తి - శ్రీకాకుళం

సైబర్ మోసాలు అరికట్టేందుకు, కేసులు సులభతరంగా ఛేదించేందుకు సాంకేతిక నైపుణ్యం కీలకపాత్ర పోషిస్తుందని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి అన్నారు. మండలంలోని గురజాడ విద్యాసంస్థలో జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యాన పోలీసు అధికారులు, సిబ్బందికి సైబర్ నేరాల దర్యాప్తుపై శనివారం నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నైపుణ్యం అనేది నిరంతర ప్రక్రియ ద్వారా లభిస్తుందన్నారు. సైబర్ కేసులు ఛేదించడంలో ప్రతి అంశాన్నీ కీలకంగా తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం నేరాల తీరు మారుతోందని, ప్రతి నేరం సైబర్ క్రైమ్, సాంకేతికతతో ముడిపడి ఉంటుందన్నారు. ఈ నేరాలను ఛేధించేందుకు దర్యాప్తు అధికారులకు ప్రత్యేకమైన శిక్షణ, వృత్తి నైపుణం అవసరమన్నారు. సైబర్ నిపుణులు సాయి రామానుజ సైబర్ అంశాలపై వివరించారు. కార్యక్రమంలో డిఎస్‌పిలు సిహెచ్.వివేకానంద, రాజశేఖర్, గురజాడ కళాశాల ప్రిన్సిపాల్ ముకళీకృష్ణ, సిఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

రాష్ట్రంలో నియంతృత్వ పాలన

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో నియంతృత్వ పాలన సాగుతోందని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ విమర్శించారు. వైసిపి నాయకులు, అభిమానులు, సోషల్ మీడియా కార్యకర్తలపై కక్షసాధింపులు, వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అక్రమ అరెస్టులపై నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో వైసిపి నాయకులతో కలిసి ఎఎస్‌పి పి.శ్రీనివాసరావుకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి సోషల్ మీడియా కార్యకర్తలపై ప్రభుత్వం కక్షకట్టి అక్రమ కేసులు పెడుతోందన్నారు. తప్పుడు కేసులు బనాయించి వారిని, వారి కుటుంబ సభ్యులను ఇబ్బందులకు గురిచేస్తోందని చెప్పారు. ప్రభుత్వ వైఫల్యాలను విమర్శించిన వారిని, అక్రమాలను ప్రశ్నిస్తున్న వారిని అక్కసుతో అరెస్టులు చేస్తోందన్నారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పక్కనపెట్టి పోలీసులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పోలీసులు ఎవరి మెప్పు కోసమో కాకుండా చట్టప్రకారం పనిచేయాలన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి పద్మావతి, వైసిపి నాయకులు పొన్నాడ రుషి, ఎడ్ల వెంకట్, అంబటి శ్రీను, ముంజేటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఎఎస్‌పికి వినతిపత్రం అందజేస్తున్న వైసిపి నాయకులు

బాబు హెచ్చరికలు పనిచేస్తాయా..?

వీక్షణం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

బెల్టు షాపులు తెరిస్తే బెల్టు తీస్తానంటూ ఇటీవల ఈదుపురం సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హెచ్చరించడం చూశాం. బెల్టు దుకాణాలు తెరిచినా, అధిక ధరలకు మద్యాన్ని అమ్మినా పీడీ యాక్ట్ నమోదు చేసి జైల్లో పెడతామంటూ చెప్పారు. ప్రస్తుతానికి మాత్రం జిల్లాలో బెల్టు షాపులపై చర్యలు తీసుకున్న దాఖలాలైతే కనిపించడం లేదు. ప్రభుత్వం గత నెల 16వ తేదీ నుంచి కొత్త మద్యం పాలసీ తీసుకొస్తే మద్యం ఆదాయానికి అలవాటు పడిన కొందరు దానికి సమాంతరంగా బెల్టు షాపుల పాత పాలసీని నడిపిస్తున్నారు. ప్రభుత్వం 158 మద్యం వ్యాపారులు దుకాణాలకు లైసెన్స్‌లను ఇస్తే వాటి పరిధిలో ప్రతి గ్రామంలో బెల్టు దుకాణాలను తెరిచారు. లాటరీ ద్వారా షాపులు దక్కించుకున్న వ్యాపారుల మాదిరిగానే బెల్టు నిర్వాహకులూ ఎక్కడ దుకాణాలు ఏర్పాటు చేయాలో నిర్ణయించుకుని అక్కడ దర్జాగా వ్యాపారాలు మొదలు పెట్టేశారు. ప్రయివేట్ వ్యక్తులు మద్యం అమ్ముకునేందుకు లైసెన్స్ ఫీజులను నిర్ణయించినట్టుగానే బెల్టు దుకాణాల ఏర్పాటుకు డిమాండ్‌ను బట్టి ధర నిర్ణయించేశారు. గ్రామాలో ఏకంగా వేలం పాటలే నిర్వహించడం బెల్టుకు దుకాణాలకు పరాకాష్ట. ఎచ్చెర్ల నియోజవర్గం రణస్థలం మండలంలోపి పాతర్లపల్లిలో బెల్టు షాపు నిర్వహణకు ఏడాదికి రూ.16 లక్షలు నిర్ణయించినట్లు వినికిడి. లావేరు మండలం సుభద్రాపురంలో బెల్టుషాపు నిర్వహణకు రూ.3.65 లక్షలు చెల్లించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇదే నియోజకవర్గంలో చాలా గ్రామాల్లో గుట్టుచప్పుడు లేకుండా పాటలు పూర్తి చేసినట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. గార మండలం జొన్నలపాడులో రెండేళ్ల పాటు బెల్టు షాపు నిర్వహించడానికి గ్రామ పెద్దల సమక్షంలో ఏకంగా ఒప్పందం చేసుకుంటున్న పరిస్థితులు వెలుగుచూస్తున్నాయి. ఇచ్ఛాపురం, సోంపేట తదితర మండలాల్లోని పలు గ్రామాల్లోనూ బెల్టుషాపులకు వేలం పాటు నిర్వహించినట్లు తెలుస్తోంది. బెల్టు దుకాణానికి అంతేసి మొత్తంలో పెట్టుబడి పెడుతుండటంతో అనివార్యంగా బాటిల్‌పై రూ.20 నుంచి రూ.40 వరకు పెంచుతూ సొమ్ము చేసుకుంటున్నారు.

ఎన్నికల సమయంలో టిడిపి, వైసిపి నాయకుల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి ఉండేది. ఇప్పుడు బెల్టు షాపుల కోసం అంతా ఐక్యతారాగం వినిపిస్తున్నారు. చాలాచోట్ల కూటమి నాయకులతో వైసిపి నాయకులు భాగస్వామ్యులవుతున్నారు. బెల్టు వ్యాపారం రిస్క్‌తో కూడుకున్నది కావడంతో అనివార్యంగా టిడిపి నాయకులు వైసిపి నాయకులనూ కలుపుకుపోతున్నారు. బెల్టు దుకాణాల నిర్వహణపై ఎవరైనా పోలీసులకో లేక మీడియాకో చెప్తే లేనిపోని ఇబ్బందులను వస్తాయని గుర్తించి అంతా కలిసిమెలిసి వ్యాపారం చేసుకుంటున్నారు. గ్రామాభివృద్ధి, గ్రామ పండగల కోసమే బెల్టు దుకాణాలను నిర్వహిస్తున్నట్లుగా బిల్డప్ ఇస్తున్నారు. మరోవైపు ఎక్సైజ్‌శాఖ అధికారులు బెల్టు షాపులు నిర్వహిస్తే బైండోవర్ కేసులు నమోదు చేస్తామంటూ చాలా ఘాటుగా ప్రకటనలు గుప్పిస్తున్నారు. మద్యం ధరలపై మందుబాబుల సౌకర్యార్థం ఏకంగా దుకాణాల వద్ద రేట్ల పట్టికతో ఫ్లెక్సీలను సైతం ఏర్పాటు చేశారు. ఎక్కడైనా ఎంఆర్‌పికి మించి అమ్మితే ఫ్లెక్సీలో ఉన్న నంబర్‌కు ఫోన్ చేసి సమాచారమివ్వాలని సెలవిచ్చారు. గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తూ అదనపు ధరకు అమ్ముతుంటే వాటిపై చర్యలు మాని లైసెన్స్ దుకాణాల వద్ద అధికారులు ఫ్లెక్సీని ఏర్పాటు చేయడం ఇదేమి విడ్డూరమని జనం ముక్కున వేలేసుకుంటున్నారు. బాటిల్‌పై రూ.20 ఎక్కువ తీసుకున్నా ఉన్న చోటే దొరుకుతోందని సంబరపడిపోతున్న మందుబాబులు ఎక్సైజ్ అధికారులకు ఏం కంప్లయింట్ చేస్తారు? అధికారులు గ్రామాల్లోకి వెళ్లి దాడులు చేయకుండా మీరు సమాచారమివ్వండి, మేం చర్యలు తీసుకుంటామంటూ అధికారులు చెప్పడం ద్వారా ఏకంగా ప్రజలకే పని కల్పించారు. గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టు దుకాణాలు నిర్వహిస్తుంటే తూతు మంత్రంగా కేసులు నమోదు చేస్తూ సరిపెడుతుండటంతో విమర్శలు పాలవుతున్నారు. గార మండలం జొన్నలపాడులో బెల్టు షాపులకు వేలం పాటలు నిర్వహించిన వైనం సోషల్ మీడియా, పత్రికల్లో వెలుగు చూసిన తర్వాత అక్కడకు వెళ్లిన ఎక్సైజ్ శాఖ అధికారులు అప్పటికప్పుడే ఏడు బాటిళ్లతో ఒకరు పట్టుబడినట్లు కథ నడిపించారు. మద్యం బాటిళ్లు దొరికిన తర్వాత అవి ఏ లైసెన్స్‌డ్ దుకాణం నుంచి వచ్చాయో గుర్తించి వాటిపై కఠిన చర్యలు తీసుకోవడానికి ఎక్సైజ్ అధికారులు ఎందుకో సాహించడం లేదు. మద్యాన్ని అధిక ధరలకు అమ్మినా, బెల్టు దుకాణాలు నిర్వహించినా అధికారులనే బాధ్యులను చేస్తానంటూ స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబే హెచ్చరించడంతో అంతకన్నా వారు మాత్రం ఏం చేయగలరు. మద్యాన్ని ఆదాయ వనరుగా భావిస్తున్న ప్రభుత్వం లైసెన్స్ దుకాణాల ద్వారా భారీగా అమ్మకాలు జరగాలనే కోరుకుంటోంది. కోట్ల రూపాయలు ఖర్చు పెట్టిన వ్యాపారులూ అధిక మొత్తంలో ఆదాయం ఆర్జించాలన్నదే వారి ఆకాంక్ష. కేవలం దుకాణాల్లో జరిగే అమ్మకాలనే నమ్ముకుంటే వారికి పెద్దగా లాభాలు వచ్చే పరిస్థితి ఉండదు. తమ సరుకు అధిక మొత్తంలో అమ్ముడుపోవాలంటే బెల్టు షాపులను ప్రత్యామ్నాయ వ్యాపారంగా వారు చూస్తున్న పరిస్థితి ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో లైసెన్స్‌డ్ దుకాణాల్లో ప్రత్యక్షంగానో లేక పరోక్షంగా వాటాలు ఉన్న కూటమి ప్రజాప్రతినిధులు, నాయకులు సహకారంతో సాగిస్తున్న బెల్టు వ్యాపారంపై చర్యలు తీసుకునే సాహసం ప్రభుత్వం చేయగలదా? అంతా వాళ్లే వ్యాపారం చేస్తుంటే బాబు హెచ్చరికలు ఇంకేం పనిచేస్తాయంటూ జనంలో గుసగుసలు వినిపిస్తున్నాయి.

సూపర్ సిక్స్ హామీలపై నిలదీస్తాం..

ఎమ్మెల్సీ రామారావు


రామారావు, ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - కవిటి

పెద్దల సభకు ప్రాతినిధ్యం వహిస్తున్న తాను కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలుపై శాసనమండలిలో నిలదీస్తానని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. సోమవారం నుంచి జరగనున్న శీతాకాల సమావేశాలకు మండలికి హాజరవుతున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వంలో పేదలకు ఎవరు అందివ్వని విధంగా సంక్షేమ పథకాలను మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డి అందించారన్నారు. ఆ పథకాలను కొనసాగిస్తూ, అదనంగా మరో ఆరు హామీలను ఇస్తామని, వాటికే సూపర్-సిక్స్ అంటూ కూటమి ప్రభుత్వం ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిందని అన్నారు. ఇప్పుడు అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. ఇప్పటికే ఖరీఫ్ ముగిసిపోయి రబీ సీజనుకు రైతులు సన్నద్ధమయ్యారు. కానీ, వారికి రైతు భరోసా నిధులు ఇప్పటికీ జమ కాలేదన్నారు. ప్రభుత్వం నూతనంగా ఏర్పడిన తర్వాత వాలంటీర్ల వ్యవహారంపైన నిర్ణయం తీసుకుంటామని తెలిపి కాలక్షేపం చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వాలు మారినా విధానపరమైన నిర్ణయాల అమలులో మార్పులు ఉండకూడదన్నారు. చట్టసభలో తనకు మాట్లాడే అవకాశం వస్తే జిల్లాలో ఉన్న ప్రధానమైన సమస్యల పరిష్కారానికి, నియోజకవర్గంలో ఉన్న సమస్యలను శాసనమండలి వేదికగా ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళ్తానని స్పష్టం చేశారు.

నేడు చిత్రలేఖనం పోటీలు

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని ఇన్‌స్పైయిర్ స్కూల్‌లో జిల్లాస్థాయి చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ముని శ్రీనివాసరావు, దూసి సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడకు చెందిన శరత్‌చంద్ర అకాడమీ ఆధ్వర్యాన ఉదయం 9 గంటల నుంచి 12 వరకు చిత్రలేఖన పోటీలతో పాటు సోలో డాన్స్ పోటీలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ పోటీల్లో 8 నుంచి 15ఏళ్లలోపు వయసు గల విద్యార్థులు హాజరు కావాలని సూచించారు. ఈ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేయనున్నట్టు తెలిపారు.


ఎస్ఐలను సత్కరిస్తున్న గ్లోబల్ ఫౌండేషన్ ప్రతినిధులు

మత్తుతో భవిష్యత్ చిత్తు

శ్రీకాకుళం అర్బన్ : యువత మత్తు పదార్థాల బారిన పడితే భవిష్యత్ చిత్తు అవుతుందని 1వ పట్టణ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ-2 బి.రామారావు, మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్ఐ ఎం.చంద్రకళ విద్యార్థులకు సూచించారు. నగరంలోని టిపిఎం స్కూల్‌లో జానకి గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రగ్స్ వలన కలిగే అనర్థాలు, సైబర్ క్రైం బారిన పడకుండా సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఎటువంటి దురలవాట్లకు పాల్పడవద్దని, మత్తుమందు జోలికి వెళ్లవద్దని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరాలకు సంబంధించి స్థానిక పోలీసులకు లేదా 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారం అందించాలన్నారు. డ్రగ్స్, సైబర్ నేరాలపై విద్యార్థులను చైతన్యం చేసేందుకు జానకి గ్లోబల్ ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనందించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు పుక్కళ్ల ఉమ మాట్లాడుతూ చిన్నతనం నుంచే విద్యార్థులో నైతిక విలువలు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎం.చాందిని, కోంద్రు హర్ష, ఐ.టెక్నీషియన్ సుజాత, బి.మోహనరావు, ఎం.రాజు పాల్గొన్నారు.

తగ్గించిన పాల సేకరణ ధరను పెంచాలి

రైతుసంఘం జిల్లా అధ్యక్షులు చందర్రావు


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న కౌలు రైతుల సంఘం నాయకులు

ప్రజాశక్తి - ఆమదాలవలస

విశాఖ డెయిరీ పాడి రైతుల దగ్గర నుంచి తీసుకుంటున్న ఆవుపాల ధరలను తగ్గించిందని ఆ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకునేలా చూడాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పొందూరు చందర్రావు ఎమ్మెల్యే కూన రవికుమార్‌ను శనివారం ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేసి కోరారు. పాడి పశువుల పోషణ ద్వారా వచ్చే ఆదాయంతో పాడి రైతులు జీవనాన్ని కొనసాగిస్తూ కాలం గడుపుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. పాడి పశువుల పోషణకు అవసరమైన అన్ని ఖర్చులు పెరిగాయని, పాల ధరలు గిట్టుబాటు కాక పోషణ భారంగా మారిందని తెలిపారు. విశాఖ డెయిరీకి ఉత్తరాంధ్ర జిల్లాల పాడి రైతులు సుమారు 3.5 లక్షల మంది రోజు తొమ్మిది లక్షల లీటర్ల పాలను పంపిస్తున్నారని, పాడి రైతుల కష్టార్జితంతో అభివృద్ధి చెందిన విశాఖ డెయిరీ సహకార రంగం నుంచి కంపెనీల చట్టంలోకి మారి గడచిన కొన్నేళ్లుగా డైరీకి వస్తున్న లాభాలు, ఆస్తులను యాజమాన్యం అన్యాక్రాంతం చేసే నష్టాల్లో ఉందని నేడు ఆవుపాల ధరను తగ్గించి పాడి రైతులకు అన్యాయం చేస్తుందని ఎమ్మెల్యేకు వివరించారు. తగ్గించిన ఆవుపాల ధరలను వెంటనే పెంచాలని, రైతులకు వచ్చే పాల ధర తగ్గించి బోనస్ ఇవ్వడం కన్నా విశాఖ డెయిరీ లాభాల నుంచి ప్రతి నాలుగు నెలలకు ఒకసారి బోనస్ ఇవ్వాలని కోరారు. విశాఖ డెయిరీని కంపెనీల చట్టం నుంచి తిరిగి సహకార రంగంలోకి తీసుకురావాలని, అన్యాక్రాంతమైన ఆస్తులను వెనక్కి తీసుకురావాలని కోరారు. విశాఖ డెయిరీలో అవినీతిపై స్వతంత్ర దర్యాప్తు సంస్థతో విచారణ చేయించి దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఆవుపాలకు లీటర్‌కు రూ.50, గేదె పాలకు రూ.80 ఇప్పించి దాణా 75 శాతం రాయితీతో ఇప్పించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెలమల రమణ, పాడి రైతులు పాల్గొన్నారు.


అచ్చెన్నాయుడుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిఐ

మంత్రిని కలిసిన టూటౌన్ సిఐ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఇటీవల శ్రీకాకుళం టూటౌన్ సిఐగా బాధ్యతలు చేపట్టిన ఈశ్వరరావు శనివారం ఉదయం రాష్ట్రమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడిని నిమ్మాడలోని ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఆయనతో పాటు పోలీసు సిబ్బంది ఉన్నారు.

అభివృద్ధి పనులకు నిధుల మంజూరు

ప్రజాశక్తి - ఆమదాలవలస

నియోజవర్గంలోని ఇరిగేషన్ పనులు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు టిడిపి కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. స్టేట్ డిజాస్టర్ మిటిగేషన్ ఫండ్ నుంచి హై ప్రయారిటీ ఇరిగేషన్ పనులు చేపట్టుటకు నియోజకవర్గానికి రూ.39.39 లక్షల నిధులను ప్రభుత్వం మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ నిధులతో సరుబుజ్జిలి మండలంలో ఏడు పనులు, ఆమదాలవలస మండలంలో ఐదు పనులు చేపట్టేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. నిధులు విడుదల చేసిన సిఎం చంద్రబాబు, నీటి పారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు ఎమ్మెల్యే రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

బాలికల విద్యపై ప్రత్యేక శ్రద్ధ

ఎమ్మెల్యే గౌతు శిరీష


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

ప్రజాశక్తి - పలాస

బాలికల విద్యపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపిస్తుందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. స్థానిక మదర్ థెరీసా పాఠశాలలో మహాత్మా జోతిరావు పూలే బాలికల పాఠశాలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో రాణించాలంటే ముఖ్యంగా విద్యపై ప్రత్యేక శ్రద్ధ కనభరచవలసి ఉంటుందని అన్నారు. అందుకోసం బాలికల విద్యపై మరింతగా శ్రద్ధ వహించి వారికి కావలసిన సౌకర్యాలు కల్పించడం, ఉన్నత విద్యను అభ్యసించేందుకు సాంకేతిక విద్యనం ప్రోత్సహిస్తున్నామని అన్నారు. బాలికలు ఉన్నత విద్యను అభ్యసించి, ఉన్నత శిఖరాలను అధిష్టించాలని ఒక మహిళా ఎమ్మెల్యే తాను కోరుకుంటున్నానని అన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎపిటిపిసి చైర్మన్ వజ్జ బాబూరావు, టిడిపి నాయకులు మల్లా శ్రీనివాసరావు, లొడగల కామేశ్వరరావు, బడ్డ నాగరాజు, డొక్కరి శంకర్ పైల చక్రధర్, చంద్రమౌళి, పాఠశాల హెచ్‌ఎం, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధికి పెద్దపీట

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో రోడ్ల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మున్సిపాలిటీ పరిధి రెండో వార్డులో రూ.5 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎపిటిపిసి చైర్మన్ వజ్జ బాబూరావు, టిడిపి నాయకులు మల్లా శ్రీనివాసరావు, లోడగల కామేశ్వరరావు, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, పైల చక్రధర్, చంద్రమౌళి పాల్గొన్నారు. అలాగే కిష్టుపురంలో రూ.14 లక్షలతో సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, సంతోష్‌కుమార్ నాయుడు, బూరెల కృష్ణంరాజు, నిమ్మాడ బాబూరావు, డిల్లేశ్వరరావు, నాగరాజు, నారాయణరావు పాల్గొన్నారు.

సైన్సు ఎగ్జిబిషన్ ప్రారంభం

మండలంలోని రామకృష్ణాపురం సత్యసాయి విద్యావిహార్‌లో సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఎపిటిపిఎస్ చైర్మన్ వజ్జ బాబూరావు, రాష్ట్ర కళింగ కోమటి అధ్యక్షులు బోయిన గోవిందరాజు, డోకి రామారావు, స్కూల్ కరస్పాండెంట్ మల్లా రమేశ్వరరావు, ప్రిన్సిపాల్ ప్రీతీ చౌదరి, డోకి రామారావు, శరత్ శ్రీను, ప్రసాదరావు, వి.జె.రావు, డోకి జగదీష్ పాల్గొన్నారు.

రోడ్లకు 'ఉపాధి' నిధుల మంజూరు

ప్రజాశక్తి - కొత్తూరు

ఉపాధి హామీ పనులను వ్యవసాయానికి అనుసంధానం చేయాలని వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి సవర సావిత్రి అధ్యక్షతన శనివారం మండల సమావేశం నిర్వహించారు. సభలో ఈ విషయంపై వైస్ ఎంపిపి లేవనెత్తగా సభ్యులందరూ ఏగ్రీవంగా ఆమోదించారు. ఈ తీర్మానాన్ని కలెక్టర్‌కు పంపిస్తామని ఎంపిపి తెలిపారు. రైతులకు పంపిణీ చేసిన విత్తనాలు కల్తీగా ఉన్నట్టు ఎఒ స్వర్ణలతను సభ్యులు నాగల్లప్పన్న నిలదీశారు. అటువంటి ఏమీ లేవని ఎఒ సమాధానం ఇచ్చారు. అలాగే రైతులు దళారులను నమ్మి మోసపోకుండా రైతు సేవా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధి హామీ ద్వారా రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయని ఎపిఒ ప్రేమలత అన్నారు. గత ప్రభుత్వంలో మంజూరైన ఇళ్లకు విద్యుత్ సరఫరా లేకపోవడంతో నిర్మాణ పనులు నిలిచిపోయాయని హౌసింగ్ ఎఇ మోహనరావు తెలిపారు. గుండి ఎంపిటిసి అగతముడి భైరాగినాయుడు మాట్లాడుతూ ఉపాధి హామీ ద్వారా ఏ గ్రామానికి ఎంత నిధులు మంజూరయ్యాయో తెలపాలని ఎఒ రాంబాబును కోరారు. వాటిని రాంబాబు సభలో చదివి వినిపించారు. సమావేశంలో ఎంపిడిఒ నీరజ, తహశీల్దార్ రవిచంద్ర, సిఎస్‌డిటి భీమారావు, ఎఇ దుర్గాప్రసాద్, ఎపిఎం డాక్టర్ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.


ఎఒ స్వర్ణలతతో మాట్లాడుతున్న సభ్యులు నాగల్లప్పన్న

పోక్సో కోర్టు పిపిగా కృష్ణచంద్


కృష్ణచంద్

శ్రీకాకుళం అర్బన్ : ఇప్పటివరకు జిల్లా ఫ్యామిలీ కోర్ట్ పబ్లిక్ ప్రాసెక్యూటర్‌గా వ్యవహరిస్తున్న వాన కృష్ణ చందకు జిల్లా ఫోక్సోకోర్ట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా అదనపు బాధ్యతలను రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రోసిక్యూషన్స్ నేటి నుంచి అప్పగించింది. ఈ రెండు కోర్టులే కాకుండా ఆయన ప్రస్తుతం శ్రీకాకుళం ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టుకు, సోంపేటలో ఉన్న 6వ జిల్లా అదనపు సెషన్స్ జడ్జి కోర్టు, సోంపేటలో ఉన్న ఆదనపు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టుకు, జిల్లా కేంద్రంలోని 4వ జిల్లా అదనపు సెషన్స్ జడ్జికోర్ట్, ఎస్‌సి, ఎస్‌టి కేసుల ప్రత్యేక కోర్టుకు, శ్రీకాకుళం అదనపు అసిస్టెంట్ సెషన్స్ జడ్జికోర్టులో ఉన్న అన్ని కౌంటర్ కేసులకు ప్రత్యేకపబ్లిక్ ప్రోసిక్యూటర్‌గా వ్యవహరిస్తున్నారు. ఇప్పటివరకు ఫోక్సో కోర్టుకు పబ్లిక్ ప్రోసిక్యూటర్‌గా వ్యవహరిస్తున్న ఎల్.వి.రమణ స్థానంలో ఆయనను నియమించినట్లు రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రోసిక్యూషన్స్ తన ఉత్తర్వులో పేర్కొన్నారు. కృష్ణచంద్ నియామకంపై స్టేట్ బార్ కౌన్సెల్ బార్ కౌన్సిల్ మెంబర్ గేదల వాసుదేవరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె.ఈశ్వరరావు, పూర్వపు అధ్యక్షులు టి.రాధాకృష్ణ, రమేష్, పి.వి.రమణారావు, వై.మురళీమోహనా రావు, బి.ఫల్గుణరావు, సూర్యారావు, సత్యనారాయణ అభినందించారు.


పశువుల వివరాలను నమోదు చేస్తున్న పశువైద్యాధికారులు

రాపాకలో పశుగణన

ప్రజాశక్తి - పొందూరు

మండలంలోని రాపాక గ్రామీణ పశువైద్య కేంద్రం జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ పి.బంగారు తల్లి ఆధ్వర్యాన శనివారం పశుగణన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి పశువుల వివరాలను నమోదు చేసి పశుగణన పోస్టర్లను అంటించారు. పశువైద్యకేంద్రం పరిధిలో మొత్తం 1,630 ఇళ్లకు ఇప్పటివరకూ 450 ఇళ్లల్లో సర్వేను పూర్తిచేసి పశువుల వివరాలను నమోదు చేసినట్లు ఆమె తెలిపారు. ఈమెతో ఎహెచ్‌ఎ బి.స్వాతి, సిబ్బంది పాల్గొన్నారు.


సెల్‌ఫోన్‌ను పోలీస్‌స్టేషన్‌లో అప్పగిస్తున్న పారిశుధ్య కార్మికులు

పారిశుధ్య కార్మికుని నిజాయితీ

ప్రజాశక్తి - రణస్థలం

మండల కేంద్రంలో శనివారం ఉదయం పారిశుధ్య కార్మికుడు సూరి రోడ్లు తుడుస్తుండగా రామతీర్థం రోడ్డులో రోడ్డుపై రూ.20 వేలు విలువ గల సెల్‌ఫోన్, బ్యాటరీ దొరికింది. సూరి ఫోన్, బ్యాటరీ పట్టుకొని శానిటేషన్ మేస్త్రి పాణికుమార్‌కు ఫోన్ చూపించగా వెంటనే ఫోన్‌కు వస్తున్న నెంబర్ చూసి సెల్‌ఫోన్ గల వ్యక్తికి సమాచారం అందించారు. దొరికిన సెల్‌ఫోన్‌ను శానిటేషన్ మేస్త్రి పాణి కుమార్, పారిశుధ్య కార్మికులు జె.ఆర్.పురం పోలీస్‌స్టేషన్‌లో అప్పగించి పారిశుధ్య కార్మికుల నిజాయితీని నిరూపించుకున్నారు.

ఆపన్నహస్తం కోసం ఎదురుచూపులు


చికిత్స పొందుతున్న సాయి

ప్రజాశక్తి - మందస

మండలంలోని హరిపురానికి చెందిన ఓలేటి సాయి ప్రయివేటు విద్యుత్ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొచ్చేవాడు. ఈ నెల 3న హరిపురం పెద్దవీధిలో విద్యుత్ స్తంభం పైకెక్కి మరమ్మతులు చేస్తున్నారు. ఈ సమయంలో జారిపడి కిందకు పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన ఆయనను స్థానిక సిహెచ్‌కి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళంలో ప్రయివేటు ఆస్పత్రిలో చేర్పించారు. ప్రస్తుతం అక్కడ చికిత్స పొందుతున్నారు. ఎక్స్‌రేతో తలకు తీవ్రంగా గాయమై బ్రెయిన్ డెడ్ అయ్యిందని, ఊపిరితిత్తులు తీవ్రంగా దెబ్బతిన్నాయని, ఎముకలు విరిగాయని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం వెంటిలేటర్‌పై ఉన్నారు. సాయి ఆపరేషన్‌కు రూ.లక్షలు ఖర్చు అవుతుందని డాక్టర్లు చెప్పడంతో తల్లిదండ్రులు దండాసి, పద్మ మదనపడుతున్నారు. రెక్కాడితే గాని డొక్కాడని స్థితిలో ఆపన్నహస్తం కోసం ఎదురు చూస్తున్నారు. ఆర్థికసాయం చేయాల్సిన వారు 7337460824 ఫోన్‌పే నంబరుకు చేయాలని కోరారు.

ఓటర్ల ప్రత్యేక నమోదు


లావేరు : ఓటర్ల నమోదు పరిశీలిస్తున్న ఇఆర్ఒ లక్ష్మణమూర్తి

ప్రజాశక్తి - ఆమదాలవలస

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శనివారం పట్టణంలోని మెట్టక్కివలసలో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. 9, 10 తేదీల్లో నిర్వహించనున్న ఈ ప్రత్యేక ఓటర్ల నమోదు కేంద్రాన్ని 49, 50వ పోలింగ్ కేంద్రాలకు సంబంధించి మున్సిపల్ ప్రాథమిక పాఠశాల హడ్కోకాలనీ వద్ద ఏర్పాటు చేశారు. బిఎల్‌ఒలు పిల్ల రామకృష్ణ, డి.జగదీష్ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు కొత్త ఓటర్ల నమోదుకు దరఖాస్తుల స్వీకరించడంతో పాటు ఓటర్ గుర్తింపు కార్డు సవరణలు, ఏవైనా సమస్యలు ఉంటే సరి చేసుకోవాలని తెలిపారు. ఎన్నికల సంఘం కల్పించిన ఈ అవకాశాన్ని ఓటర్లందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, యాదవ సంఘం నియోజకవర్గ అధ్యక్షులు నాగళ్ల మురళీధర్ యాదవ్, ధర్మారావు, కరుణాకరరావు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

లావేరు: ప్రత్యేక ఓటర్లు నమోదు కార్యక్రమంలో భాగంగా అర్హులైన యువతీ యువకులకు ఓటుహక్కు కల్పించాలని నియోజకవర్గ ఎన్నికల ఇఆర్ఒ లక్ష్మణమూర్తి అన్నారు. లావేటిపాళెం బూత్ నెంబర్ 80ను పరిశీలించారు. అనంతరం సుబద్రపురం, బెజ్జిపురం పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈయనతో పాటు బిఎల్‌ఒలు దమరసింగి భాను, ప్రసన్న లక్ష్మి, బలివాడ రాజశేఖర్ తదితరులున్నారు.


ఆమదాలవలస : ఓటర్ల నమోదును పరిశీలిస్తున్న బిఎల్‌ఒలు

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని పిఎస్ఎన్ఎం స్కూల్‌లో 263, 264, 265 పోలింగ్ కేంద్రాల ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాలను టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు పిఎంజె బాబు, జిల్లా ఐటిడిపి అధ్యక్షులు ప్రధాన విజయరాంలు సందర్శించారు. రెండు రోజుల పాటు బూత్ లెవెల్లో పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు జాబితాలో చేర్పులు, తొలగింపులు, సవరణలకు ఫారం 6,7,8లో దరఖాస్తులను స్వీకరిస్తుండడంతో కేంద్రాలను సందర్శించి నమోదు ప్రక్రియను పరిశీలించారు.


పురస్కారాన్ని అందుకుంటున్న కృష్ణమూర్తి

'తెప్పల'కు పురస్కారం

పలాస : రాజమహేంద్ర వరం ఆదికవి నన్నయ్య విశ్వ విద్యాలయంలో శనివారం శ్రీశ్రీ కళావేదిక 141వ జాతీయ శతాధిక కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనంలో పలాసకు చెందిన సీనియర్ రచయిత, నటుడు, జనజాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ తెప్పల కృష్ణమూర్తికు నన్నయ్య విశ్వ విద్యాలయ పురస్కారం లభించింది. వృద్ధాప్యం వరమే అను కవితాగానం చేసి ప్రశంసలు పొందారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ఉప కులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు, శ్రీశ్రీ కళావేదిక కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి, డాక్టర్ పార్థసారథి చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. కృష్ణమూర్తికి పలాస లయన్స్‌క్లబ్ అధ్యక్షులు హనుమంతు ఎండుదొర, జన జాగృతి అధ్యక్షులు కుమారనాయక్, ఉద్దానం సాహితీ వేదిక అధ్యక్షులు లండ రుద్రమూర్తి, లలిత కళారంజని అధ్యక్షులు చిన్నాచారి, తెరవే అధ్యక్షులు ఉత్తరావల్లి నాగేశ్వరరావు అభినందనలు తెలిపారు.

23 నుంచి సూర్యదర్శన ప్రవచనం


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కళాసమితి సభ్యులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సుమిత్ర కళాసమితి ఆధ్వర్యాన ఈ నెల 23 నుంచి సామవేదం షణ్ముకశర్మతో నగరంలోని బాపూజీ కళామందిర్‌లో సూర్యదర్శన ప్రవచనం నిర్వహిస్తున్నట్టు కళాసమితి అధ్యక్షులు ఇప్పిలి శంకరశర్మ తెలిపారు. శనివారం నగరంలోని పాలకొండ రోడ్డులో ఉన్న కోదండరామ స్వామి ఆలయ ప్రాంగణంలో ఉపనిషత్ మందిరంలో ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ ప్రవచనం ఈనెల 27 వరకు ప్రతిరోజూ సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో సమితి ప్రతినిధులు గుమ్మా నగేష్, గుత్తు చిన్నారావు, కొంక్యాన మురళీధర్, నక్క శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎలుగుల సంచారం

ప్రజాశక్తి - నౌపడ

సంతబొమ్మాళి మండలం చిన్నతుంగాం పంచాయతీ పెద్దతుంగాంలో శుక్రవారం రాత్రి ఎలుగు పిల్లలతో సంచరించడంపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాల వద్ద ఎలుగు, రెండు పిల్లలతో రాత్రి 10 గంటల సమయంలో పలువురు గ్రామస్తుల కంటపడింది. దీంతో వారు అరుపులు, కేకలు వేయడంతో సమీపంలోని కొండ వైపు పరుగు తీసింది. ఎలుగుల సంచారానికి సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. దీనిపై అటవీశాఖ అధికారులు స్పందించి ప్రమాదం జరగకముందే చర్యలు తీసుకోవాలని సర్పంచ్ సిమ్మ గోవిందరావు, పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.


సంచరిస్తున్న ఎలుగులు

రూ.40 కోట్లతో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - లావేరు

ఎచ్చెర్ల నియోజకవర్గం అభివృద్దే లక్ష్యంగా పని చేస్తున్నామని అందులో భాగంగా రూ. 40 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. ఇటీవల పల్లెపండగా కార్యక్రమంలో భాగంగా గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం సిమెంట్ రోడ్లు, కాలువల నిర్మాణానికి నిధులు మంజూరు చేయగా ఉపాధిహామీ పథకంలో చేపట్టిన రోడ్లను సహపురం, వెంకట్రావుపేట, బుడతవలస గ్రామాల్లో రూ.30 లక్షల వ్యయంతో నిర్మించిన సిమెంట్ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఇప్పటికే లావేరు, రణస్థలం, జి.సిగడాం మండలాల్లో అభివృద్ధి పనులకు రూ.40.కోట్లు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. గత వైసిపి పాలనలో గ్రామాలు అభివృద్ధి పనులకు నోచుకోలేదన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, మాజీ ఎంపిపి, జెడ్‌పిటిసిలు ఎం. వెంకటరమణ, పి.మధుబాబు, ఎంపిడిఒ వెంకటరాజు, పిఆర్ ఎఇ శ్రీవల్లి, కూటమి నాయకులు ఎర్రసూర్యం, కోనేటి శ్రీనువాసురావు, సాయికుమార్, దారపురెడ్డి కూర్మరావు తదితరులు పాల్గొన్నారు.


లావేరు : సిమెంట్ రోడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

రణస్థలం రూరల్: పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా రణస్థలం పంచాయతీలో రూ.40 లక్షలతో నిర్మించిన నాలుగు సిసి రోడ్లను ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పిన్నింటి భానోజీనాయుడు, ఎంపిటిసి ప్రతినిధి వెంకటరమణ, లెంక శ్యాం, కెల్ల హేమంత్, కార్యదర్శి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులతోనే సరి...


మరమ్మతులు చేపట్టిన రామయ్యవలస-ప్రియాగ్రహారం రోడ్డు

ప్రజాశక్తి - పోలాకి

మండలంలో పంచాయతీల్లో మేజర్ పంచాయతీ పిర్యాగ్రహారం. సుమారు ఆరు వందల కుటుంబాలు నివశిస్తుంటాయి. ఈ గ్రామంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాల, బ్యాంకు, పోస్టాఫీసు ఇలా అన్ని సౌకర్యాలూ ఉన్నాయి. అయితే ఈ గ్రామానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉన్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ గ్రామానికి కోటబొమ్మాళి, టెక్కలి, నరసన్నపేట నుంచి నిమ్మాడ మీదుగా పిర్యాగ్రహారం వెళ్లిన బిటి రోడ్డు రామియవలస నుంచి నాలుగు కిలోమీటర్ల పొడవు ఉంది. ఈ రోడ్డులో రాళ్లు తేలి గోతులు ఏర్పడడంతో మరీ అధ్వాన్నంగా తయారైంది. ఈ బిటి రోడ్డుపైనే నిమ్మాడ, తులసిపేట, మూలపేట, రామియవలస, వెంకటరత్నంపేట, తెల్లవానిపేట, కాకినాడపేట, సంగమియ్యపేట గ్రామాల నుంచి ప్రియాగ్రహారం పైనుంచే తమ అవసరాలకు మండల కేంద్రానికి పోలాకి, పిన్నింటిపేట రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రోడ్డు అధ్వానంగా ఉందని అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించడంతో మరమ్మతులు చేసి గోతుల్లో తారు వేశారు. కానీ, శాశ్వత రోడ్డు పరిష్కారం చూపడంలేదని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపించాలని గ్రామపెద్దలు నూకరాజు, లావేటి కృష్ణ, ప్రసాదరావు, తవిటయ్య, కోటేశ్వరరావు కోరుతున్నారు.


రాళ్లు తేలిన ప్రియాగ్రహారం రోడ్డు

'జ్ఞానభారతి'కి అరుదైన గౌరవం

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

జ్ఞానభారతి సిబిఎస్ఇ సీనియర్ సెకండరీ పాఠశాల ప్రత్యేక అరుదైన గౌరవాన్ని పొందింది. ఈస్ట్‌కోస్ట్ రైల్వే, ఖుర్దా డివిజన్ పరిధిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పాఠశాలగా గౌరవాన్ని అందుకుంది. అమృత్ భారతి స్టేషన్స్ స్కీమ్‌లో భాగంగా ఖుర్దా డివిజన్ పరిధిలోని సుమారు 42 పాఠశాలల్లో డిఆర్ఎం ఆధ్వర్యాన భారత్ - వికసిత్ రైల్వే ప్రధాన అంశంగా వివిధ కార్యక్రమాలను ఈ ఏడాది ఫిబ్రవరి 19న నిర్వహించారు. రైల్వే అధికారుల సమక్షంలో వివిధ భాషల్లో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో జ్ఞానభారతి పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా పాఠశాల విద్యార్థులు ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలనూ ప్రదర్శించారు. పాఠశాల సెక్రటరీ, సిఇఒ జోహార్‌ఖాన్ ఆధ్వర్యాన సమర్థవంతంగా, ప్రణాళికాబద్ధంగా, ఉన్నత ప్రమాణాలతో ఈ కార్యక్రమం నిర్వహించారు. 42 పాఠశాలల్లో ఉత్తమ పాఠశాలగా జ్ఞానభారతిని రైల్వే ఉన్నతాధికారులు ఎంపిక చేశారు. ఖుర్దా రైల్వే డివిజన్ డిఆర్ఎం ఎచ్.ఎస్.బజ్వా అత్యుత్తమ పాఠశాలగా ఎంపికైనందుకు నగదు, ప్రశంసను ప్రకటించారు. ఈ మేరకు శనివారం ఖుర్దా రైల్వే డివిజన్ అధికారులు జ్ఞానభారతి పాఠశాలకు విచ్చేసి పాఠశాల కార్యదర్శి సిఇఒ జోహార్‌ఖాన్‌కి డిఆర్ఎం నగదు, ప్రశంస రివార్డును అందించారు. డిఆర్ఎం వారి తరపున అభినందనలు తెలియజేశారు. తమ పాఠశాలను ఉత్తమ పాఠశాలగా ఎంపిక చేసినందుకు ఖుర్దా రైల్వే డివిజన్ డిఆర్ఎంకి జోహార్‌ఖాన్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ అవార్డు సాధించడంలో ఎంతో అంకితభావంతో కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులను విద్యార్థులను అభినందించారు.


నగదు అందుకుంటున్న జోహార్‌ఖాన్

క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలి

ప్రజాశక్తి - భోగాపురం

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన 68వ రాష్ట్రస్థాయి అండర్-14 వాలీబాల్ పోటీలు శనివారం విజయనగరం జిల్లా భోగాపురం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానం ఘనంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికగా 26 బాల బాలికల జట్లు, మూడు రోజులపాటు నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నాయి. ఈ పోటీలను విజయనగరం కలెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న శ్రీకాకుళం జిల్లా క్రీడాకారులు పాల్గొన్నారు.


ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న శ్రీకాకుళం జిల్లా క్రీడాకారులు


నగదును అందజేస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

బాధితులను ఆదుకుంటాం

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని సహపురంలో ఇటీవల అగ్నిప్రమాదంలో పూరిల్లు కాలిపోయిన ఘటనలో బాధితులను ప్రభుత్వం అన్నివిధాల ఆదుకుంటుందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్. ఈశ్వరరావు అన్నారు. శనివారం బాధితుడు బోర ముసలయ్య కుటుంబాన్ని పరామర్శించి ప్రభుత్వం తరుపున తక్షణ సహాయంగా రూ.పదివేలు నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పక్కాగృహాన్ని మంజూరు చేస్తామని హామీఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ముప్పుడి సురేష్, ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, మాజీ ఎంపిపి ఎం.వెంకటరమణ, పి.మధుబాబు, ఆర్.ప్రకాశరావు తదితరులున్నారు.


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘువర్మ

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి- పొందూరు

ఉపాధ్యాయుల సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ అన్నారు. శనివారం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్యపుస్తకాల్లో సిలబస్ కుదించినందున పోటీ పరీక్షల్లో ఉపయోగపడే అవకాశం లేదన్నారు. 117 జిఒ రద్దు చేయడానికి, ఉద్యోగ, ఉపాధ్యాయ బకాయిలు వెంటనే చెల్లించడానికి రాబోయే సమావేశాల్లో కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎపిటిఎఫ్ బలపర్చిన తన అభ్యర్థిత్వానికి మద్దతు అందించి మరోసారి తనను ఎమ్మెల్సీగా గెలిపించాలని ఉపాధ్యాయులను ఆయన కోరారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ జిల్లా కార్యదర్శి పప్పల తిరుమలరావు, సీనియర్ నాయకులు పేడాడ లక్ష్మణరావు, రాష్ట్ర కౌన్సిలర్ కోరుకొండ విజయ్‌కుమార్, మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణారావు, తేజేశ్వరరావు, టిడిఎఫ్ జిల్లా అధ్యక్షులు పూజారి హరిప్రసన్న తదితరులు పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందజేస్తున్న ఉపాధ్యాయులు

విద్యార్థికి ఆర్థికసాయం

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాళి మండలం కాకరపల్లి ప్రభుత్వ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న ఎం.అజయ్‌కుమార్ కొద్ది రోజులుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న మండలంలోని ఉపాధ్యాయ సంఘాలు బాధిత విద్యార్థి ఇంటికి వెళ్లి శనివారం పరామర్శించారు. యోగ క్షేమాలు తెలుసుకుని బాధితుడు తల్లిదండ్రులకు రూ.70 వేలు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో సంతబొమ్మాళి మండల ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు హెచ్.శివప్రసాద్, కె.వెంకటరమణమూర్తి, కె.పాపారావు, డి.గణపతిరావు, పి.శంకరరావు, పి.ఫాల్గుణరావు, ఎ.షణ్ముఖరావు, ఎ.గోవిందరాజులు, కాకరపల్లి పాఠశాల ఉపాధ్యాయులు సుదర్శనరావు, రవి పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవులపై హర్షం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో జనసేన పార్టీకి చెందిన తూర్పు కాపులకు రెండు నామినేటెడ్ పదవులు దక్కడం ఆనందంగా ఉందని తూర్పు కాపు సంక్షేమ సంఘం ప్రతినిధులు డోల జగన్మోహన్, సురంగి మోహనరావులు పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా పాతపట్నం నియోజకవర్గం జనసేన నాయకుడు కొరికాన రవికుమార్, తూర్పుకాపు సంక్షేమ సంఘం చైర్మన్‌గా పాలవలస యశస్వినిలను ప్రభుత్వం నియమించడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో సంఘం ప్రతినిధులు లంక గాంధీ, శాసపు జోగినాయుడు, లోలుగు రాజశేఖర్, వాన కృష్ణచంద్, కొమ్ము రమణమూర్తి, నారాయణరావు ఉన్నారు.


మాట్లాడుతున్న ఎపిఎం ప్రసాదరావు

'ఉల్లాస్'పై శిక్షణా తరగతులు

వజ్రపుకొత్తూరు: నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్ ముఖ్య ఉద్దేశమని ఎంపిడిఒ రమేష్‌నాయుడు తెలిపారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో ఉల్లాస్‌పై మండలస్థాయి శిక్షణా తరగతులు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాలంటీర్లుగా పనిచేసే టీలచర్లు ఓపిగ్గా, సహనంతో ఉండాలన్నారు. సెర్ప్ ఎపిఎం గొడబ ప్రసాదరావు ఆర్థిక అక్షరాస్యతపై, చట్టాలపై, డిజిటల్ లీటరసీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ విస్తరణ అధికారి తిరుమలరావు, సిసిలు, విఒఎలు పాల్గొన్నారు.

'అపార్' నమోదుపై అవగాహన

కవిటి: విద్యార్థులకు సంబంధించి అపార్ ఐడి నమోదుపై ప్రధానోపాధ్యాయులకు ఎంపిడిఒ శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులకు శనివారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల పూర్తి వివరాలను నమోదు చేసేటప్పుడు తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న ఎంపిడిఒ శ్రీనివాస్‌రెడ్డి

వృత్తి విద్యా శిక్షణపై దృష్టిసారించాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

వృత్తి విద్యా శిక్షణా కార్యక్రమాలపై శాస్త్రవేత్తలు దృష్టి సారించాలని ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.శివనారాయణ అన్నారు. శనివారం పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్శనలో భాగంగా కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో విస్తరణ కార్యక్రమాల అమలులో చేపట్టాల్సిన చర్యలను శాస్త్రవేత్తలకు సూచించారు. జిల్లాలో ఉన్న వ్యవసాయ పంటలను ఆధారంగా సాగులో వచ్చే సమస్యల ఆధారంగా కార్యక్రమాలను చేపట్టాలని, వృత్తి విద్యా శిక్షణ కార్యక్రమాలపై దృష్టి సారించాలని తెలిపారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలతో చర్చిస్తూ విస్తరణ కార్యక్రమాల అమలుపై చర్చించారు. వ్యవసాయంలో పరిశోధన స్థానాలు చేపట్టిన పరిశోధన ఫలితాలను రైతు స్థాయిలో పరిశీలన చేపట్టేటప్పుడు జాగ్రత్తలు తీసుకొని రైతులకు అవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయంలో ఏర్పడుతున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిశోధన స్థానాల పరిశీలనకై పంపించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆయనతో పాటు శాస్త్రవేత్తలు, కెవికె సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ శివనారాయణ

శాస్త్రి అరుదైన రికార్డు

ఆన్‌లైన్‌లో 2,500 కోర్సులు పూర్తి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రభుత్వం సైబర్ సెక్యూరిటీపై అందిస్తున్న కోర్సు చదివి తన కుమార్తెకు చెప్పే ప్రయత్నంలో తండ్రి నిత్య విద్యార్థిగా అనేక కోర్సులను పూర్తి చేసి రికార్డు సృష్టించాడు. నగరంలోని బలగ ప్రాంతంలో నివాసముంటున్న ఎంవిఎస్-ఎస్ శాస్త్రి ఆన్‌లైన్‌లో ప్రఖ్యాత సంస్థలు ఉచితంగా అందిస్తున్న కోర్సుల్లో చేరి పరీక్షలను సైతం నెగ్గి రికార్డును నెలకొల్పాడు. వృత్తి రీత్యా జర్నలిస్టు అయినా ఆయన రెండేళ్ల వ్యవధిలో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రఖ్యాత సంస్థలు అందిస్తున్న కోర్సుల్లో 2,500 పూర్తి చేశాడు. క్రమం తప్పకుండా ప్రతిరోజూ నాలుగు నుంచి ఆరు గంటల సేపు ఆన్‌లైన్ కోర్సులు చదవడం 2022 అక్టోబరులో మొదలు పెట్టి యజ్ఞంలా చదివానని ఆయన చెప్పారు. ఆయనకు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియా అచీవర్ రికార్డు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డులను ఆయా సంస్థలు అందించినట్లు తెలిపారు. ఆన్‌లైన్ అంతర్జాతీయ సంస్థలైన గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్, ఐబిఎం, లింక్డ్ఇన్, ఫేస్‌బుక్, మెటా, ఆటోడెస్క్, ఓషా, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్, కార్పొరేట్ ఫైనాన్స్ ఇనిస్టిట్యూట్ తదితర కోర్సులను పూర్తి చేసినట్లు తెలిపారు. కోర్సులు పూర్తి చేసినందుకుగాను ఆయా సంస్థల నుంచి ధ్రువపత్రాలను స్వీకరించగలిగానన్నారు.



సర్టిఫికెట్లుతో శాస్త్రి

పెరుగుతున్న వాహనాల చోరీలు

ప్రజాశక్తి- పొందూరు

మండలంలో పలు ఇళ్ల ముందు ద్విచక్ర వాహనాలు పార్కు చేసి తెల్లవారి లేచి చూసేసరికి కనిపించకపోవడంతో పలువురు వాహనదారులు లబోదిబోమంటున్నారు. మండలంలో ఇటీవల ఇటువంటి సంఘటనలు చోటుచేసుకుంటుండడంతో పలువురు ద్విచక్రవాహన యజమానులు రోదిస్తున్నారు. మండలంలో పలు గ్రామాల్లో వాహనదారులు ఆరుబయట ద్విచక్రవాహనాలు పెట్టుకుంటున్నప్పటికీ వాటికి భద్రత లేకుండా పోతుంది. ఇంటిముందు పెట్టుకుంటున్న ద్విచక్రవాహనాలను దొంగలు తమ చేతివాటం ప్రదర్శించి ఎత్తుకెళ్లిపోతున్నారు. రూ.లక్షలు పెట్టి కొనుక్కున్న ద్విచక్రవాహనాలు చోరీకి గురి అవుతున్నాయంటూ పోలీస్‌స్టేషన్‌కు పరుగులు పెడుతున్నారు. మండలంలోని దల్లవలస గ్రామంలో ఈనెల 5న కొంచాడ సూర్యనారాయణ ఇంటిముందు పెట్టుకున్న స్కూటీ చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే రాపాకలో సుమారు వారం రోజుల క్రితం కొంచాడ సీతన్నాయుడుకు చెందిన ద్విచక్రవాహనం చోరీకి గురైంది. అలాగే కొన్ని నెలలు కిందట రాపాకకు చెందిన సంచాన రాజారావు ద్విచక్రవాహనం చోరీకి గురికాగా, అదే సమయంలో రాపాక కూడలిలోను, రైల్వేస్టేషన్ సమీపంలో కూడా ద్విచక్రవాహనాలు చోరీకి గురైనట్లు అప్పట్లో పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. మండలంలో ద్విచక్రవాహనాలు చోరీని అరికట్టేందుకు రాత్రి వేళల్లో పోలీసుల నిఘాను పెంచాల్సిన అవసరం ఉందంటూ పలువురు ద్విచక్ర వాహనదారులు కోరుతున్నారు. దీనిపై ఎస్ఐ సత్యనారాయణ మాట్లాడుతూ ద్విచక్రవాహనాల చోరీలపై ఫిర్యాదులు వచ్చాయని, వీటిపై కేసులు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తం

ప్రజాశక్తి- ఆమదాలవలస

సైబర్ మోసాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ కె. వెంకటేష్ అన్నారు. శనివారం పురపాలక సంఘంలోని మెట్టక్కివలసలో సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి విక్రయించే వారి వివరాలు తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని, అలాగే గంజాయికి అలవాటు పడ్డ వ్యక్తులు ఎవరైనా ఉంటే వారి సమాచారాన్ని తెలియజేస్తే వారికి కౌన్సిలింగ్ ఇచ్చి డీ అడిక్షన్ సెంటర్ ద్వారా మామూలు మనుషులుగా మార్చుతామన్నారు. అలాగే రుణాలు ఇప్పిస్తామని ఎవరైనా ఫోన్ చేసి వివరాలు అడిగితే అటువంటి వారికి ఎటువంటి సమాచారం ఇవ్వవద్దని సూచించారు. ఎటిఎం కేంద్రాల వద్ద గుర్తు తెలియని వ్యక్తులకు ఎటిఎం కార్డు ఇచ్చి డబ్బులు తీయమని కోరవద్దని సూచించారు. ఎవరైనా సైబర్ మోసాలకు గురైతే వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ యాదవ సంఘం అధ్యక్షుడు నాగళ్ల మురళీధర్ యాదవ్, మురళీకృష్ణ, పోలీస్ సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వెంకటేష్

టిడిపి సభ్యత్వ నమోదు


సభ్యత్వ నమోదు చేస్తున్న రాజశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

టిడిపి సభ్యత్వం ఆత్మవిశ్వాసానికి ప్రతీక అని మండల టిడిపి మాజీ అధ్యక్షులు అనపాన రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఆంపురం పంచాయతీలో పలు గ్రామాల్లో శనివారం టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ సభ్యత్వానికి టిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్‌టిఆర్ ఆనాడే బీజం వేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మండల తెలుగు యువత అధ్యక్షులు బసవ పరమేశ్వర్‌రెడ్డి, వాబ జగన్, చక్రి, భైరాగి పాల్గొన్నారు.

ఆర్.బెలగాం...

కవిటి : మండలంలోని ఆర్.బెలగాం పంచాయతీలో శనివారం టిడిపి నాయకుల ఆధ్వర్యాన పార్టీ సభ్యత నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మణిచంద్ర, ప్రకాష్, సంతోష్ పట్నాయక్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పార్టీ సభ్యత్వ నమోదును చేయించుకోవాలన్నారు. సభ్యత నమోదు వల్ల పార్టీ బలోపేతం కావడమే కాకుండా ప్రభుత్వపరంగా వచ్చే పథకాలు అన్నిటికీ పార్టీ పరంగా తోడ్పాటు అందిస్తాయని అన్నారు.


పరిశీలిస్తున్న డిటి శ్రీహరి

పోలింగ్ కేంద్రాలు పరిశీలన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

కొత్త ఓటర్ల నమోదు మార్పులపై, చేర్పులపై పోలింగ్ కేంద్రాలను డిటి శ్రీహరి శనివారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలోని 35,36,37,45,46,47,69,70,71,18,19 పోలింగ్ కేంద్రాలు తనిఖీ చేశామన్నారు. రెండు రోజుల పాటు ప్రతి పోలింగ్ కేంద్రం వద్దా బూత్ స్థాయి అధికార్లు అందుబాటులో ఉంటారని తెలిపారు. కొత్త ఓటర్లు చేర్పులు, తొలగించడం, మార్పులు చేసేందుకు ప్రత్యేకంగా అందుబాటులో ఉంటారని, సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. జనవరి 1, 2024 ఓటర్ల జాబితాలో ప్రచురితమవుతుందని అన్నారు.


నివాళ్లర్పిస్తున్న ఎమ్మెల్సీ రామారావు

వైసిపి నాయకులు దేవరాజ్ మృతి

ఇచ్ఛాపురం: పట్టణ వైసిపి మాజీ అధ్యక్షులు కాళ్ల దేవరాజు అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. శనివారం స్వగ్రామంలో అంతిమయాత్రకు నిర్వహించారు. ఈ యాత్రకు భారీగా నాయకులు, అభిమానులు తరలివచ్చి నివాళ్లర్పించారు. ఎమ్మెల్యే బెందాళం అశోక్, చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, వ్యాపారులు, యాదవుల సంఘ నాయకులు పాల్గొన్నారు. స్వగృహం నుంచే వేలాది మంది తరలివచ్చారు.

చట్టాలపై అవగాహన అవసరం

ఎచ్చెర్ల: విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసి నాయుడు అన్నారు. చిలకపాలెంలోని శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు చట్టాలపై శనివారం అవగాహన కల్పించారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ చేస్తున్న సేవలు, కార్యక్రమాలను వివరించారు. ఉచిత న్యాయం, సమ న్యాయం త్వరితగతిన పేదలకు అందించడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో సోంపేట, పలాస జూనియర్ సివిల్ జడ్జీలు ఎ.రాము, యు.మాధురి, జి.ఇందిరాప్రసాద్, శివానీ కళాశాల ప్రిన్సిపల్ వై.శ్రీనివాసరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు ఉచిత నేత్ర వైద్య శిబిరం

పాతపట్నం: మండలంలోని తెంబూరులో సత్యసాయి భజన మండలి ఆధ్వర్యాన శంకర్ ఫౌండేషన్ నేత్రాస్పత్రి సౌజన్యంతో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని సత్యసాయి జిల్లా ఇన్‌ఛార్జి బోయిన చంద్రమౌళి తెలిపారు. ఈ మేరకు గ్రామాల్లో శనివారం ఆటోల ద్వారా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కంటి వెంబడి నీరు కారుతున్నా, కళ్ళు మసక మసకగా కనబడుతున్నా, మరే ఇతర సమస్యలున్నా శిబిరానికి వచ్చి తనిఖీలు నిర్వహించుకోవాలని కోరారు.

కృష్ణంనాయుడుకి అభినందనలు

పోలాకి: టిడిపి నాయకులు, న్యాయవాది రోణంకి కృష్ణంనాయుడుకు కూటమి ప్రభుత్వం శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కళింగ వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా శనివారం నియమించింది. ఈ మేరకు పలువురు టిడిపి నాయకులు కృష్ణంనాయుడును అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను మొదటి నుంచీ టిడిపి నమ్ముకొని ఉండి కష్టపడి పార్టీ విజయానికి కృషి చేశానని అన్నారు. తన సేవలను గుర్తించి ఈ పదవి ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తికి కృతజ్ఞతలు తెలిపారు.

సిసి రోడ్డు పనులు పరిశీలన

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

సిసి రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని మండల టిడిపి నాయకులు వంక రామారావు అన్నారు. మండలంలోని పల్లివూరు పంచాయతీ హుకుంపేటలో చేపడుతున్న సిసి రోడ్డు పనులను శనివారం పరిశీలించారు. ఎమ్మెల్యే గౌతు శిరీష సిసి రోడ్డు నిర్మాణానికి రూ.4 లక్షలు మంజూరు చేశారని అన్నారు. ఈ మేరకు గ్రామస్తులు తరుపున ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. మత్స్యకార గ్రామాలు టిడిపితోనే సాధ్యమవుతుందని అన్నారు. టిడిపి ఎన్నికల హామీలను ప్రాధాన్యతాక్రమంలో అమలు చేస్తుందని అన్నారు. ఉచిత గ్యాస్ పథకం అమలవుతుందని, గ్యాస్ బుక్ చేసుకున్న వారు ఖాతాల్లో ఏడాదికి మూడు సిలిండర్లకు ప్రభుత్వం డబ్బు జమ చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మురిపింటి పాపారావు, కొమర మహేష్ పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

కృష్ణదాస్ పరామర్శ


పరామర్శిస్తున్న కృష్ణదాస్

ప్రజాశక్తి- నరసన్నపేట

పట్టణంలోని జర్నలిస్టు కాలనీలో జర్నలిస్టు, శిష్టకరణం కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ సదాశివుని కృష్ణ పెద్దన్నయ్య, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు దుర్గాప్రసాద్ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ శనివారం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుకి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట ఎంపిపి ఆరంగి మురళీధర్, జెడ్‌పిటిసి చింతు రామారావు, సుడా కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోరాడ చంద్రభూషణ గుప్త, పొందర కార్పొరేషన్ మాజీ చైర్మన్ రాజాపు అప్పన్న, అటవీ శాఖ మాజీ డైరెక్టర్ బొబ్బాది ఈశ్వరరావు, యువజన విభాగం అధ్యక్షుడు బుడ్డల రాజశేఖర్, తోట భార్గవ్, కాళిదాసు, మోహనరావు ఉన్నారు.

రాయితీపై మినప విత్తనాలు

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని రైతులకు రాయితీపై మినప విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎన్.శ్రీనివాసరావు శనివారం తెలిపారు. అల్లెన, ఎపిపేట, గుత్తావల్లి, చీడివలస, కొరగాం, డొంకలపర్త, పాలవలస, కొల్లివలస గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో విక్రయాలకు సిద్ధంగా ఉన్నాయన్నారు. ప్రస్తుతం 12 క్వింటాల మినప విత్తనాలు వచ్చాయన్నారు. కేజీ మినుములు రూ.140కాగా రూ.42 సబ్సిడీతో రూ.98కే అందించడం జరుగుతుందన్నారు. అలాగే గ్రీన్ గ్రామ్ రూ.130 కేజీ ధర కాగా రూ.39 సబ్సిడీతో 91 మంది రైతులకు అందించడం జరుగుతుందన్నారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసుకోవచ్చునని తెలిపారు.


విత్తనాలను అందజేస్తున్న అగ్రికల్చర్ అసిస్టెంట్ ఇంద్రజ


రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలు

జంగిల్స్ తొలగించరూ...

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలంలోని జాతీయ రహదారి హరిశ్చంద్రపురం కూడలి నుంచి చిన్న హరిశ్చంద్రపురానికి వెళ్లే ఆర్అండ్‌బి రోడ్డుకు ఇరువైపుల దట్టంగా పెరిగిన జంగిల్స్‌ను క్లియర్ చేయాలని వాహనదారులు, గ్రామస్తులు కోరుతున్నారు. జాతీయ రహదారి హరిశ్చంద్రపురం కూడలి నుంచి చిన్నహరిశ్చంద్రపురానికి వెళ్లిన రోడ్డులో ఇరువైపులా పిచ్చిమొక్కలు, ముళ్లచెట్లు దట్టంగా పెరగడంతో ఎదురుఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని అన్నారు. ఇటీవల రెండు బైక్ ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, మరొకరు గాయపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను క్లియర్ చేయించి రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కృషి చేయాలని కోరుతున్నారు.

శిథిలావస్థలో హరిపురం పశువైద్యశాల

ప్రజాశక్తి- మందస

మండలంలోని హరిపురంలో 1988లో అప్పటి ఎమ్మెల్యే గౌతు శ్యామసుందరి శివాజీ ప్రారంభించిన పశు వైద్యశాల శిథిలావస్థకు చేరుకుంది. శ్లాబ్ కప్పు పెచ్చులూడి పడుతున్నాయి. దీంతో ఏ క్షణాన ఏం జరుగుతుందో అని అక్కడ పనిచేస్తున్న సిబ్బందితో పాటు పాడి రైతులు భయాందోళనకు గురవుతున్నారు. మరోపక్క నిత్యం రద్దీగా ఉండే ఈ పశువైద్యశాలకు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. మరోపక్క మహిళా సిబ్బందికి మరుగుదొడ్లు లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


శిథిలావస్థలో ఉన్న పశువైద్యశాల


అవార్డును అందుకుంటున్న కవి రాజారావు

రాజారావుకు సత్కారం

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రజా కవి కాళోజీ స్మారక జాతీయస్థాయి కవితల పోటీల్లో ప్రముఖ కవి రచయిత కుప్పిలి వెంకట రాజారావుకు హైదరాబాద్ రవీంద్ర భారతిలో బహుమతి అందజేసి శనివారం సత్కరించారు. భారత్ కల్చరల్ అకాడమీ, తెలుగు టెలివిజన్ రచయితల సంఘం నిర్వహించిన కవితల పోటీల్లో రాజారావు రచించిన 'నిర్లక్ష్యపు ముళ్లు మొలుస్తుంటే' అన్న కవితకు బహుమతి లభించింది. సంస్థ అధ్యక్షులు నాగబాల సురేష్ కుమార్, కార్యదర్శి సాధనాల వెంకట స్వామినాయుడు చేతులమీదుగా రాజారావు బహుమతిని అందుకున్నారు.

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని నెల్లిపర్తి పంచాయతీ పరిధిలోని గొల్లపేటకు చెందిన వైసిపి నాయకుడు చేపేన శ్యామలరావు ఎమ్మెల్యే కూన రవికుమార్ సమక్షంలో టిడిపిలో చేరారు. ఈయనతో పాటు మరో 10 కుటుంబాలు టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన శ్యామలరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే రవికుమార్ నియోజకవర్గానికి అధిక నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేయడం, టిడిపి విధి విధానాలు నచ్చి ఆకర్షితుడినై పార్టీలో చేరినట్లు తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపిని బలోపేతం చేసి అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు శెట్టి పద్మ, దేశిలంక రమణ, శెట్టి నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.


అభినందిస్తున్న ఎంపీ కలిశెట్టి

ప్రపంచ పర్యటన చేస్తున్న ముత్తుసెల్వన్

అభినందించిన ఎంపీ కలిశెట్టి

ప్రజాశక్తి- రణస్థలం

ప్రపంచ శాంతి, పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా సైకిల్‌పై ప్రపంచ పర్యటన చేస్తున్న తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరుకు చెందిన ముత్తా సెల్వన్ శనివారం రణస్థలం చేరుకొన్నారు. విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడుని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ ప్రపంచాన్ని చూడాలన్నదే తన ఆశయమని, మొక్కలు నాటడంపై అవగాహన కల్పిస్తున్నానని చెప్పారు. 1111 రోజుల్లో 34,200 కిలోమీటర్ల ప్రయాణం సాగించడమే తన లక్ష్యమని ఆయన వివరించారు. 2021 డిసెంబరు 28న తన ప్రయాణం ప్రారంభమైందని, 2025లో ముగుస్తుందని చెప్పారు. భారతదేశంలోని అన్ని రాష్ట్రాలతో పాటు బంగ్లాదేశ్, నేపాల్‌లో కూడా పర్యటిస్తానని ఆయన తెలిపారు. ఇలాంటి మహోత్సవమైన కార్యక్రమాన్ని చేపట్టినందుకుగాను సెల్వాన్‌ని ఎంపీ అప్పలనాయుడు అభినందించారు.

సిపిఎం జిల్లా మహాసభల దృశ్యమాలిక


కళారూపాలను వీక్షిస్తున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు, ప్రజలు


మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తులసీదాస్


కోలాటం ప్రదర్శించిన చిన్నారులతో శ్రీనివాసరావు, తులసీదాస్


తప్పెటగుల్లను ప్రదర్శిస్తున్న కళాకారులు




మహా ప్రదర్శనలో ముందు భాగాన శ్రీనివాసరావు, తులసీదాస్ తదితరులు



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు


కోలాటం ఆడుతున్న మహిళలు


కోలాటమాడుతున్న చిన్నారులు



మహా ప్రదర్శనలో పాల్గొన్న మహిళలు




ప్రజాశక్తి బుక్‌హౌస్ స్టాల్‌లో కొనుగోలు చేస్తున్న పుస్తకాలు


డప్పులు వాయిస్తున్న కళాకారులు